మార్కెట్ కమిటీ పాలకవర్గంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల/ గణపురం, ఆగస్టు 8 : వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మొగుళ్లపల్లి మండలం ఆకినపల్లి, పెద్ద కోమటిపల్లి, చిట్యాల మండలకేంద్రంతో పాటు, ఒడితలలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖాన, గణపురం మండలం చెల్పూర్ జీపీ పరిధి బొబ్బిలంపల్లిలో పల్లె దవాఖాన, మొగుళ్లపల్లి మండలకేంద్రం, ఇస్సిపేటలో పీఏసీఎస్ గోదాములను ప్రారంభించారు. చిట్యాల వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. నూతన పాలకవర్గం రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం నిజాయితీగా పని చేయాలని సూచించారు. కాగా మార్కెట్ చైర్మన్‌గా గుమ్మడి శ్రీదేవీ సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఎండీ రఫీ, డైరెక్టర్లుగా ఎం సమ్మయ్య, కే సంపత్, ఎన్ విజేందర్, మటిక రవీందర్, భూక్యా రాజ్‌నాయక్, మేరుగు లక్ష్మి, చెన్న చందర్, ఎల్ కిరణ్ రావు, కే సతీశ్‌రెడ్డి, లింగయ్య, వీ వినయ్ కుమార్, ఏ బాలచంద్ర, మొగుళ్లపల్లి పీఏసీఎస్ చైర్మన్ నర్సింగరావు ప్రమాణాస్వీకారం చేశారు. అనంతరం మండలకేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగాంగా డీఆర్‌డీవో నరేశ్, ఎంపీడీవో జయశ్రీతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కాంగ్రెస్ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, పార్టీ రాష్ట్ర నాయకులు రాంనర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు గూట్ల తిరుపతి, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మూల శంకర్‌గౌడ్, గణపురం ఎంపీడీవో భాస్కర్, డీఎంహెచ్‌వో మధుసూదన్, డాక్టర్ గౌతమ్, పంచాయతీ కార్యదర్శి హరిచంద్రా రెడ్డి, వైద్యాధికారులు స్వాతి, మోహన్, ఏఎన్ఎం సుజాత, సొసైటీ వైస్ చైర్మన్ కావటి రవీందర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా స్వచ్ఛదనం-పచ్చదనం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 8 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య సిబ్బంది, ఉద్యోగులు, పారిశుధ్య నిర్వహణ, స్వచ్ఛ ఆటోల పని తీరు, జీపీఎస్ ఏర్పాటు, ఇంటి పన్నుల వసూలు, బకాయిలు, మున్సిపాలిటీ నిధులు, ఆదాయ, వ్యయం, తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛదనం –పచ్ఛదనం కార్యక్రమం, పారిశుధ్య నిర్వహణ, స్వచ్ఛ ఆటోల నిర్వహణ, స్వీపింగ్ యంత్రం వినియోగం, స్వచ్ఛ వాహనాలకు జీపీఎస్ ఏర్పాటులో అలసత్వం వహిస్తున్న కమిషనర్ రాజేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని, పారిశుధ్య సిబ్బందిని వార్డుల వారిగా విభజించి, స్వీపింగ్ యంత్రాన్ని వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. స్వచ్ఛ వాహనాలకు తక్షణమే జీపీఎస్ ఏర్పాటు చేయాలన్నారు. హనుమాన్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఎనిమల్ బెర్త్ కంట్రోల్ యూనిట్‌ను తనిఖీ చేశారు. 3వ వార్డు సీఆర్ నగర్ కాలనీలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి 3వ తరగతి విద్యార్థులతో కొద్ది సేపు ముచ్చటించారు.

పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు పంపాలి

కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు మండల ప్రత్యేక అధికారులు, ఆయా శాఖల సంక్షేమ అధికారులు ప్రతిపాదనలు పంపాలన్నారు. గోడలు తడవడం వల్ల విద్యుత్ ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని, అధికారులు తనిఖీ చేసి పరిష్కరించాలన్నారు. బుధవారం నిర్వహించిన సంక్షేమ అధికారులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పలు సమస్యలు తన దృష్టికి తెచ్చారని తెలిపారు. లో ఓల్టేజీ విద్యుత్ సమస్య పరిష్కారానికి టు ఫేజ్ సరఫరా ఉన్న వసతి గృహాలకు త్రీ ఫేజ్ ఇవ్వాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా చేయాలని, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న హాస్టళ్లకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత యజమానుల దేనని, వారి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

గుర్రంపేట ఎస్సీ కాలనీ ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తానని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన కాలనీలో సింగరేణి అధికారులతో కలిసి పేలుళ్ల ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కలెక్టర్‌కు తమ గోడు వెల్లబోసుకున్నారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మళ్లీ ఒక రోజు వచ్చి పేలుళ్ల ఉధృతినీ తనిఖీ చేసి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ రావు, పశుసంవర్ధక శాఖ అధికారి గోపాల కృష్ణమూర్తి, టీపీవో సునీల్, మున్సిపల్ ఇంజినీర్ పీ మానస, మేనేజర్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్ , సీపీవో శామ్యూల్, డీపీవో నారాయణరావు, ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు సునీత, శైలజ, పంచాయతీరాజ్ ఈ ఈ దిలీప్, డీఈవో రాజేందర్, ఎస్సీ జిల్లా సమన్వయ అధికారి భిక్షపతి, విద్యుత్ డీ ఈ నాగరాజు, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

పెండింగ్ పనులు పూర్తి చేయాలి : అదనపు కలెక్టర్

వాజేడు, ఆగస్టు 8 : పాఠశాలల్లో అసంపూర్తి పనులను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని చెప్పినా చాలా చోట్ల పెండింగ్‌లో ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే పనులు పూర్తిచేసి విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే అమ్మ ఆదర్శ కమిటీ నిర్వాహకులు, హెచ్ఎంలు, ఎంఈవో సైతం ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఎంపీడీవో విజయ, ఎంఈవో తేజావత్ వెంకటేశ్వర్లు, ఏపీఎం లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవానికి రండి

జిల్లా అధికారులకు ఆహ్వానం

ములుగురూరల్, ఆగస్టు 8 : మండలంలోని బండారుపల్లి గిరిజన భవన్‌లో నేడు జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి రావాలని కోరుతూ ఆదివాసీ ఉద్యోగుల సంఘం నాయకులు కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ పీ శబరీష్, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఎంహెచ్‌వో అప్పయ్య, డీఈవో పాణిని, జడ్పీ సీఈవో సంపత్‌రావును వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఆహ్వానించిన వారిలో సంఘం అధ్యక్షుడు మంకిడి రవి, ఉపాధ్యక్షుడు రవికాంత్, నాయకులు అల్లెం భాస్కర్, తుడుందెబ్బ నాయకులు వజ్జరాజు, ఈక కుమార్ ఉన్నారు.

ఐటీడీఏలో ఏర్పాట్లు

ఏటూరునాగారం : ఐటీడీఏ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం నిర్వహించేందుకు అధికారులు గురువారం ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం అధికారులు, ఆదివాసీ సంఘాలు బస్టాండు నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ, కుమ్రంభీం విగ్రహానికి పూల మాలలు వేస్తారు. అనంతరం గిరిజన భవన్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. అక్కడ ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నిర్వహణ కోసం ప్రత్యేక అధికారులను నియమించారు. ఐటీడీఏ పీవో, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొననున్నారు.

గంజాయి ముఠాల అరెస్ట్

వివరాలు వెల్లడించిన పోలీసులు

కాటారం/భూపాలపల్లి రూరల్, ఆగస్టు 8 : గంజాయి తరలిస్తున్న ముఠాలను గురువారం అరెస్టు చేశారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, మహదేవపూర్ సీఐ రాంచందర్‌రావు, కాటారం ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. కాటారం మండలకేంద్రం శివారులో యువకులు గంజాయితో సంచరిస్తున్నారనే సమాచారంతో ఎస్సై అభినవ్ తెల్లవారుజామున కాటారం–మంథని రహదారిపై పెట్రోల్ పంప్ వద్ద గల ఆదివారంపేట మూలవైపు వెళ్లగా ఏడుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. తనిఖీ చేయగా రూ.36వేల విలువ చేసే 1.800 కిలోల ఎండు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కాటారం గ్రామానికి చెందిన దుర్గం నందకిశోర్, మెరిజాల రోహిత్, కడారి కార్తీక్, మారపాక రిశ్వంత్, కొత్తపల్లి గ్రామానికి చెందిన పెద్ది నిఖిల్‌రాజ్, బయ్యారం గ్రామానికి చెందిన జగ జంపుల విష్ణు, ఎర్రగుంటపల్లికి చెందిన జక్కు రాజేశ్‌గా గుర్తించారు. భూపాలపల్లికి చెందిన లావుడ్య సిద్ధు అనే వ్యక్తి దగ్గర నుంచి గంజాయి కొనుగోలు చేసి గ్రామాల వారీగా విక్రయిస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నట్లు ఎస్సై వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని సీఐ, ఎస్సై తెలిపారు. పీసీలు లక్ష్మిరాజు, నరేశ్, జంపన్న, సాంబశివరావు, లవణ్, హరికుమార్, హోంగార్డు తిరుపతి పాల్గొన్నారు. అలాగే గణపురం మండలం గొల్లపల్లి క్రాస్‌వద్ద ఎస్సై అశోక్ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆరుగురు వ్యక్తులు ఒకరు బైక్‌పై, ఐదుగురు ఆటోలో అనుమానాస్పదంగా కనిపించారు. వారిని సోదా చేయగా బ్యాగులో సుమారు రెండు కిలోల గంజాయి కనిపించిందని తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా భూపాలపల్లి మండలం వేశాలపల్లి గ్రామానికి చెందిన లావుడ్యా సిద్ధు, వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన జనగాం ప్రేమ్ తేజ్, కొండాపూర్‌కు చెందిన కీసర సంతోష్, యామన్‌పల్లికి చెందిన కొండగొర్ల రంజిత్, భూపాలపల్లికి చెందిన మేకల అరుణ్, కడారి సాయికుమార్ కొద్ది రోజులుగా భద్రాచలం పరిసర ప్రాంతాల నుంచి గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి గణపురం, భూపాలపల్లి మండలాల పరిసర ప్రాంతాల్లో అమ్ముతున్నారు. గంజాయిని, బైక్, ఆటో, ఆరుగురు వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. సమయస్ఫూర్తితో పనిచేసిన చిట్యాల సీఐ డీ మల్లేశ్, గణపురం ఎస్సై అశోక్, సిబ్బంది రాజు, నేతాజీ, శ్రీనివాసులు, యాకేశ్‌ను డీఎస్పీ ప్రత్యేకంగా అభినంధించారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

గతంలో ఎంపిక చేసిన వారికే ఇండ్లు ఇవ్వాలి

కృష్ణ కాలనీ, ఆగస్టు 8 : మున్సిపల్ పరిధి 11వ వార్డు భాస్కర్‌గడ్డలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను గతంలో ఎంపిక చేసిన 393 మంది లబ్ధిదారులకు మాత్రమే కేటాయించాలని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజుపటేల్ అన్నారు. గురువారం పార్టీ కౌన్సిలర్లతో కలిసి ఆయన మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గతంలో ఎంపిక చేసిన వారు ఇండ్లు లేని నిరుపేదలని, వారికి మాత్రమే కేటాయించాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. కానీ, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వారికి అనుకూలమైన వారి పేర్లతో వార్డుకు 14 మంది చొప్పున మొత్తం 416 మంది జాబితాను కలెక్టర్‌కు పంపించారన్నారు. ఆ పార్టీకి చెందిన నాయకులతో కమిటీ వేసి జాబితాను రూపొందించినట్లు ఆరోపించారు. ఈ క్రమంలో లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి డబ్బులు డిమాండ్ చేశారని, తమకు పూర్తి సమాచారం ఉందన్నారు. అధికార పార్టీ నేతలు ఇచ్చిన జాబితాపై పూర్తి విచారణ చేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. ఇందుకు కలెక్టర్ సైతం సానుకూలంగా స్పందించారన్నారు. కౌన్సిలర్లు మంగళపెల్లి తిరుపతి, ముంజంపల్లి మురళీధర్, బద్ది సమ్మయ్య, బీఆర్ఎస్ నాయకులు సెగ్గం సిద్ధు, మల్లేశ్, కరాటే శ్రీనివాస్, రాజమల్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

జ్వరంతో వివాహిత మృతి

మంగపేట, ఆగస్టు 8: మండలంలోని రమణక్కపేటలో బుధవారం జ్వరంతో తెల్ల ప్రవళిక (25) మృతి చెందింది. ప్రవళికకు వారం రోజుల క్రితం జ్వరం రాగా, గ్రామంలోని ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించారు. అయినా జ్వరం తగ్గక పోవడంతో భద్రాచలంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. దీంతో అక్కడి వైద్యుల సూచన మేరకు ప్రవళికకు ఆక్సిజన్ పెట్టి వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందింది.

నాలుగు ఇసుక లారీల సీజ్

గోవిందరావుపేట, ఆగస్టు 8 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు లారీలను బుధవారం అర్ధరాత్రి పస్రా రేంజ్ అధికారులు పట్టుకున్నారు. అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా వస్తున్న లారీలను అటవీ శాఖ అధికారులు ఆపి తనిఖీ చేశారు. అందులో ఇసుక ఉండడంతో వేబిల్లులు, ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీలను చెక్ పోస్టు వద్దే నిలిపివేశారు. గురువారం ఉదయం వరకు ఎలాంటి అనుమతి పత్రాలను చూపించకపోవడంతో సీజ్ చేసినట్లు పస్రా వైల్డ్‌లైఫ్ రేంజ్ అధికారి బాలరాజు తెలిపారు. లారీలు మంగపేట మండలం రామాంజారం నుంచి హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు రేంజ్ అధికారి తెలిపారు.

జాతీయరహదారిపై గుంతలు పూడ్చివేత

ఏటూరునాగారం, ఆగస్టు 8 : మండలం లోని ఐటీడీఏ సమీపం లోని మూల మలుపు, మంగపేట వెళ్లే మూల మలుపు వద్ద రోడ్డు గుంతలు పండగా, గురువారం పోలీసులు పూడిపించారు. ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్ పరిశీలించారు.

పరిశీలిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

సింగరేణి అధికార ప్రతినిధిని టీబీజీకేఎస్ సన్మానం

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 8 : భూపాలపల్లి సింగరేణి అధికార ప్రతినిధి తుకారాం బదిలీపై జైపూర్‌కు వెళ్తున్న సందర్భంగా గురువారం జీఎం కార్యాలయంలో టీబీజీకేఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ బడితల సమ్మయ్య, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ నల్లవెల్లి సదానందం, దేవర కొండ మధు, బాసనపల్లి కుమారస్వామి, నరేశ్, సురేశ్, నరేందర్, చంద్రమూర్తి, రాజేందర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

కాటారం, ఆగస్టు 8 : మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితాల తయారీపై మూడు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు గురువారం శిక్షణ ఇచ్చారు. కాటారం, మల్హర్‌రావు, మహాముత్తారం మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు శిక్షకులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు శిక్షణ నిచ్చారు. ఎంపీడీవోలు బాబు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ర్యాగింగ్ నియంత్రణకు కృషి చేయాలి : ఎస్పీ

ములుగురూరల్, ఆగస్టు 8 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ర్యాగింగ్ నియంత్రణకు అధ్యాపకులు కృషి చేయాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ అన్నారు. గురువారం ఆయన ర్యాగింగ్ నియంత్రణపై అధ్యాపకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రత్యేక నోడల్ అధికారులను నియమించుకోవాలన్నారు. ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లేశం, డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్ రావు, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

నింధితులపై చర్యలు తీసుకోవాలి

కృష్ణకాలనీ, ఆగస్టు 8 : దళిత మహిళపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకొని వారిని సర్వీస్ నుంచి పూర్తిగా రిమూవ్ చేయాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలను కాపాడే పోలీసులే మహిళ అని చూడకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం హేయమైన చర్య అన్నారు. బాధిత మహిళకు ప్రభుత్వం వెంటనే రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పెండెల దేవరాజ్, పుల్ల సతీశ్, రేణుకుంట్ల మహేశ్, బచ్చల చిరంజీవి, శీలపాక హరీశ్, శీలపాక నరేశ్, రాకేశ్, రమేశ్, శ్రవణ్ పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కృష్ణకాలనీ/ ములుగు రూరల్, ఆగస్టు 8 : కేసు విషయమై మాట్లాడేందుకు జనగామ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాద దంపతులపై దాడికి పాల్పడిన పోలీసులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ల ములుగు జిల్లా అధ్యక్షుడు ఎం వినయ్‌కుమార్, భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించించారు. భూపాలపల్లిలో ఎర్రబ్యాడ్జీలు ధరించి పీడీఎం కోర్టు ప్రాంగణం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ తీసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహేందర్, వినయ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవాద దంపతులు అమృతరావు, కవితపై జనగామ పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యులైన సీఐ, ఎస్సైపై కేసు నమోదు చేసి వారిని సస్పెండ్ చేయాలని, లేకపోతే ఉద్యమిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీలు కీరవాణి, చిరంజీవి, కవిత, లైబ్రరీ సెక్రటరీ అక్షయ, ట్రెజరర్ సంగెం రవీందర్, ములుగు కార్యదర్శి సునీల్, న్యాయవాదులు నర్సిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, చంద్రయ్య, భిక్షపతి, రవీందర్, చిరంజీవి, ప్రతాప్, అశోక్, రాజేందర్, విజయ్ కుమార్, మన్సూర్‌అలీ, సుందర్‌రాము, నరోత్తమ్‌రెడ్డి, ఓంకార్, ప్రణయ్, అర్చన, నవత, రజిత పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, **MD KHAJA SHAMSUDDIN** S/o **Md Khaja Moinuddin** R/o H.No. 2-7-848, Alipura, Subedari, Hanamkonda, Hanumakonda Dist., T.S. In my daughter's Passport my Name has been wrongly mentioned as **MOHAMMED KHAJA SHAMSHUDDIN GULRAIZ** instead of **MD KHAJA SHAMSUDDIN.**

NTW-000

CHANGE OF NAME

★I, the undersigned **MUNDADA TARA** (New name) previously called **TARAKUMARI MUNDADA** (Old Name), W/o **SRINIVAS MUNDADA** R/o. H.No: 8-4-90, Sri Krishna Colony, Station Road, Warangal district-506002, T.S. Solemnly declare.

NTW-17189

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య

మహదేవపూర్/ కాటారం/తాడ్వాయి/వెంకటాపురం(నూగూరు)/గోవిందరావుపేట/ఏటూరునాగారం/వాజేడు/ములుగురూరల్, ఆగస్టు 8 : ఆరోగ్యపరంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గడిగడ్డ కాలనీతో పాటు పలు కాలనీల్లో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వైద్యులు, వైద్య సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అనారోగ్య సమస్య తలెత్తిన వెంటనే ప్రభుత్వ దవాఖాలోని వైద్యులను సంప్రదించాలన్నారు. ఎంపీడీవో రామకృష్ణ, జీపీ కార్యదర్శి రఘు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేసి, సకాలంలో వైద్య చికిత్సలు పొందేలా సూచనలివ్వాలని ఏటూర్‌నాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా సూచించారు. మండలకేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో పాటు ఘణపురంకాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంతో పాటు ఫీవర్ సర్వేను గురువారం పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యాధికారి మహేందర్‌కు సూచించారు. మొరుమురు పంచాయతీలో చేపట్టిన పరిశుధ్యపనులపై పంచాయతీ కార్యదర్శి కార్తీక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు. ఏటూరునాగారం మండలంలోని దొడ్ల, కొత్తూరు, గొత్తికోయ గూడెం గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే చేశారు. దొడ్లలోని పాఠశాలలో 35 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి, వైద్యాధికారి ప్రణిత్ మందులు పంపిణీ చేశారు. గోవిందరావుపేట మండలంలోని చల్వాయి గ్రామ పరిధిలోని పోచంపల్లిలో ఇంటింటా ఫీవర్ సర్వే చేశారు. 'స్వచ్ఛదనం–పచ్చదనం'లో భాగంగా స్థానిక వైద్యాధికారి చంద్రకాంత్, ఎంపీడీవో జవహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ స్వచ్ఛదనంపై అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి అనూష, హెల్త్ అసిస్టెంటల్ జంపయ్య, కార్యదర్శి భారతి ఉన్నారు. వెంకటాపురం(నూగూరు) మండలంలోని పాత్రాపురం, ఉప్పేడు, వీరాపురం, వెంకటాపురం జీపీలో వైద్య సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే చేశారు. ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, జీపీ కార్యదర్శులు ప్రవీణ్, జనార్దన్ ఉన్నారు. వాజేడు మండలంలోని వాజేడు, పేరూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని భువనపల్లి, చీకుపల్లి, ప్రగళ్లపల్లి, మొరుమురు, గుమ్మడిదొడ్డి, ఘణపురంకాలనీ, జంగాలపల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. వైద్యాధికారులు రహీల్, జ్ఞానస, యోషిత, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ పాల్గొన్నారు. తాడ్వాయి మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని ఎంపీడీవో సుమనవాణి సూచించారు. మండలంలోని నార్లాపురంలో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. మండలంలోని కాటాపురంలో పారిశుధ్య పనులను ఎంపీవో శ్రీధర్ పరిశీలించారు. వాజేడు మండలంలోని గుమ్మడిదొడ్డి పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి రేఖశ్రీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఇంటింటా పంచాయతీ ట్రాక్టర్‌తో వెళ్లి చెత్తను సేకరించారు. మొబైల్ వైద్యాధికారిణి యోషితరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి, గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. మహదేవపూర్, కాటారం గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని ఎన్కపల్లిలో అంబట్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. రోగులకు మందులను పంపిణీ చేసి, వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, అంజలి, రాజు, సృజన్, మహేశ్, సతీశ్, రమేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కాటారం మండలకేంద్రంతో పాటు దామెరకుంట గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వర సర్వే చేశారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు మౌనిక, పంచాయతీ కార్యదర్శి షఫీర్‌ఖాన్, ఎంఎల్‌హెచ్‌పీ సుమన్, ఆరోగ్య విస్తరణ అధికారి తిరుపతిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఏఎన్ఎం విజయలక్ష్మి, శ్యామల పాల్గొన్నారు.



ములుగు రూరల్: ములుగులో ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య


వాజేడు: వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా

ప్రజలతో మమేకమయ్యేందుకే సేవా కార్యక్రమాలు

కాటారం/ మహాముత్తారం, ఆగస్టు 8 : ప్రజలతో మమేకమై వారికి మరింత చేరువయ్యేందుకే సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు 58వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సంజయ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని అయ్యప్ప ఫంక్షన్ హాల్ ఆవరణలో గురువారం సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సైకిళ్లు, గ్రామీణ ప్రాంత యువతకు ఆట వస్తువులు, మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. అలాగే కాటారం పీహెచ్‌సీ, ఎర్రగుంటపల్లి అంగన్వాడి కేంద్రం , ప్రతాపగిరి పంచాయతీలకు వాటర్ ట్యాంక్‌లను అందజేశారు. అలాగే మహాముత్తారం మండలం సింగారం జీపీ పరిధి మద్దిమడుగు గొత్తికోయగుంపులో సీఆర్పీఎఫ్ 58 బెటాలియన్ కమాండెంట్ మోహన్ సహకారంతో గిరిజనులకు ఎస్సై మహేందర్‌కుమార్ సింటెక్స్ ట్యాంకులు, సోలార్‌లైట్లు, కుట్టుమిషన్లు, సైకిళ్లు, ఆటవస్తువులు అందజేశారు.

10న సెలక్షన్ కమిటీని సంప్రదించాలి

ములుగురూరల్, ఆగస్టు 8 : ములుగు ప్రభుత్వ వైద్య కళాశాలకు సంబంధించిన 32 ఔట్‌సోర్సింగ్ పోస్టులకు 10 అభ్యర్థనలు వచ్చినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ మోహన్‌లాల్ గురువారం తెలిపారు. ఫైనల్ మెరిట్‌లిస్ట్‌పై అభ్యర్థనలు జూలై 30 నుంచి ఈ నెల 3 వరకు గ్రీవెన్స్ సెల్ ద్వారా స్వీకరించగా, 10 అభ్యంతరాలు వచ్చినట్లు తెలిపారు. అభ్యర్థనలు తెలిపిన వారు ఈ నెల 10న కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సెలక్షన్ కమిటీని సంప్రదించాలని సూచించారు.

గ్రామాల్లో జీపీ సిబ్బంది సమ్మె

వెంకటాపురం(నూగూరు)/మహదేవపూర్, ఆగస్టు 8 : ఒక్కరోజు సమ్మెలో భాగంగా మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో జీపీ సిబ్బంది గురువారం విధులు బహిష్కరించి కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. రాజబాపు, దేవరాజు, గోగుల స్వామి, రాజ య్యా పాల్గొన్నారు. వెంకటాపురం(నూగూరు) మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని 18 పంచాయతీల కార్మికులు ఒక్క రోజు సమ్మె నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీను ప్రారంభించారు.

ఉద్యోగుల విభాగం జిల్లా ఇన్‌చార్జిగా కుమార్

ములుగురూరల్, ఆగస్టు 8 : ఆదివాసీ న్యాయకపోడు హక్కుల పోరాట సమితి (పోడ్‌దెబ్బ) ములుగు జిల్లా ఉద్యోగుల విభాగం జిల్లా ఇన్‌చార్జిగా గొల్ల కుమార్‌ను నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు దబ్బ సుధాకర్, జాతీయ కో ఆర్డినేటర్ నెమలి నర్సయ్య మాదిగ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రవి సమితికి చేసిన కృషిని గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించినట్లు వారు పేర్కొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటాం

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 8 : ర్యాగింగ్‌కు పాల్పడి విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ కిరణ్ ఖరే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ అనే తేడా లేకుండా స్నేహపూర్వకంగా విద్యనభ్యసించాలన్నారు. ర్యాగింగ్ కేసుల్లో ఇరుకుంటే బంగారు భవిష్యత్తును కోల్పోతారని, వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు.

మొబైల్ షాపులో చోరీ

కాళేశ్వరం, ఆగస్టు 8 : కాళేశ్వరంలోని ముక్తీశ్వర (చిన్న) మొబైల్ షాపులో చోరీ జరిగినట్లు బాధితుడు రాజబాపు తెలిపారు. గురువారం తెల్లవారు జామున షాపు రేకులు కట్ చేసి లోపలికి చొరపడి నాలుగు మొబైల్‌లు, రూ.50 వేలు నదగదు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పర్యావరణాన్ని కాపాడాలి

గణపురం, ఆగస్టు 8: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో గ్రామస్తులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి గ్రామంలో ఎంపీడీవో పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమ్మల్ల విజేందర్, ఇన్‌చార్జి ఏపీవో రాజు, టీఏ శ్రావణ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ దూలం శ్రీదేవి పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

తాడ్వాయి : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సరంక్షించాలని ప్రిన్సిపాల్ అవిలయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థులు స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం జాతీయ రహదారిపై ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ శ్రీకాంత్‌రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు. చెట్లను పెంచుదాం, పర్యావరణాన్ని రక్షిద్దాం అంటూ నినాధాలు చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ చెట్లను పెంచడం అలవాటు మార్చుకోవాలన్నారు.

దుకాణాలకు టెండర్ వేసుకోవాలి

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 8: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న 8 దుకాణాలకు నేడు టెండర్ వేసుకోవాలని భద్రాచలం డిపో మేనేజర్ తిరుపతి తెలిపారు. గురువారం ఆయన బస్టాండ్ ఆవరణలో షాపుల టెండర్‌పై సమావేశం నిర్వహించారు. టెండర్లలో పాల్గొనేందుకు ఎస్టీ అభ్యర్థులకు మాత్ర మే అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి గల వారు టీజీ ఆర్టీసీ ఖమ్మం పేరున డీడీలు తీసి టెండర్ ఫా రం భద్రాచలం డిపోలో అందజేయాలని, టెండర్లను సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు యూరియా సరఫరా

కన్నాయిగూడెం, ఆగస్టు 8 : మండలకేంద్రంలోని రైతు ఆగ్రోస్ సేవాకేంద్రం ద్వారా సబ్సిడీపై అందిస్తున్న యూరియా బస్తాలను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర ప్రారంభించి రైతులకు అందించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ.. రైతు ఆగ్రోస్ ద్వారా రైతులకు అందిస్తుండటంతో రవాణా ఖర్చులు లేకుండా కేవలం రూ.266 బస్తాకు తీసుకుంటున్నారని తెలిపారు. ఏడీఏ శ్రీధర్, ఇన్‌చార్జి ఏవో వేణుగోపాల్ పాల్గొన్నారు.

రామప్పలో శిక్షణ అధికారులు

వెంకటాపూర్, ఆగస్టు 8 : రామప్ప దేవాలయాన్ని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రానికి వచ్చిన న్యూఢిల్లీకి చెందిన సెక్షన్ అధికారులు శిక్షణలో భాగం గా సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతరాలయంలో స్వామి వారి శేషావస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ ప్రాముఖ్యత, కాకతీయుల చరిత్రను టూరిజం గైడ్లు వారికి వివరించారు. వారి వెంట కో ఆర్డినేటర్లు పీ వినోద్‌గౌడ్, రవి, అధికారులు ఉన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

మంగపేట, ఆగస్టు 8 : వివాహ శుభకార్యాలకు ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్–2 డిపో మేనేజర్ జ్యోత్స్న గురువారం కోరారు. ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ సర్వీస్‌లు తక్కువ ధరకు అందుబాటులో ఉన్నాయని, శుభకార్యాలకు వచ్చే నెల 3లోగా బస్సులు బుక్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ ఫోన్ నంబర్ 8919937008, 7382856145ను సంప్రదించాలని సూచించారు.